క్లుప్తంగా

క్రమశిక్షణతో చదువుకోవాలి



కంకిపాడు: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని తెన్నేరు గ్రంథాలయాధికారి ఎస్.సునీత సూచించారు. వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా తెన్నేరు శాఖా గ్రంథాలయంలో స్పోకెన్ ఇంగ్లిష్, గణితంపై గురువారం రాత పరీక్షలు నిర్వహించారు. సునీత మాట్లాడుతూ.. ఆసక్తి గల రంగాలను ఎంచుకుని ప్రావీణ్యం సంపాదించాలని విద్యార్థులకు సూచించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం, కథల పోటీలు నిర్వహించారు. శిక్షణ కార్యక్రమాలను గ్రంథాలయాధికారి సీహెచ్.రామకృష్ణ పర్యవేక్షించారు.

విధుల్లో చేరిన తహసీల్దార్



పెనమలూరు: పెనమలూరు తహసీల్దార్‌గా కట్టా వెంకటశివయ్య గురువారం విధుల్లో చేరారు. ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్న టి.వి.సతీష్ మచిలీపట్నం బదిలీ కావటంతో ఆయన స్థానంలో తోట్లవల్లూరు నుంచి కట్టా శివయ్యను నియమించారు. ఆయను పెనమలూరులో తన కార్యాలయంలో తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని వెంకటశివయ్య తెలిపారు.

నేడు తహసీల్దార్ అభినందన సభ

కంకిపాడు: ప్రత్యేక తహసీల్దార్‌గా మచిలీపట్నం కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్లిన తహసీల్దార్ టి.వి.సతీష్ అభినందన సభను శుక్రవారం నిర్వహించనున్నట్లు రెవెన్యూ ఉద్యోగులు తెలిపారు. ఇటీవల జరిగిన బదిలీల నేపథ్యంలో కంకిపాడు తహసీల్దార్ సతీష్ మచిలీపట్నం కలెక్టరేట్‌లోని ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ ప్రత్యేక తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. దీంతో పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో అభినందన సభ నిర్వహించనున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు అందరూ హాజరుకావాలని రెవెన్యూ ఉద్యోగులు కోరారు.

అభయాంజనేయుని సేవలో ఘంటా పద్మశ్రీ



హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానాన్ని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ గురువారం సందర్శించారు. నూతనంగా జెడ్పీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించేందుకు వెళుతూ ఇక్కడి అభయాంజనేయ స్వామి దేవస్థానానికి విచ్చేశారు. పద్మశ్రీకి ఆలయ పాలక మండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈఓ కూచిపూడి శ్రీనివాస్, ప్రధాన అర్చకుడు మారేపల్లి సీతారామానుజాచార్యులు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆమె ప్రత్యేక పూజలు చేశారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాద్ పాల్గొన్నారు.

కేసరపల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా నరేష్

గన్నవరం: మండలంలోని కేసరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా తోట నరేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. బంటుమిల్లి మండలంలోని కంచడం జెడ్పీ హైస్కూల్ నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇన్‌చార్జ్ హెచ్‌ఎంగా కొనసాగిన భూపతి మనూజ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం హెచ్‌ఎం నరేష్‌ను ఉపాధ్యాయులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

చెత్త సమస్యకు పరిష్కారం



నూతనంగా కొనుగోలు చేసిన కాంపాక్టర్



ప్రజలకు అందుబాటులో ఏర్పాటుచేసిన డంపర్ బిన్

- చర్యలు తీసుకున్న తాడిగడప మునిసిపాలిటీ
- అందుబాటులోకి వచ్చిన మూడు కాంపాక్టర్లు
- మునిసిపాలిటీ పరిధిలో 50 డంపర్ బిన్ల ఏర్పాటు

పెనమలూరు: మండలంలోని తాడిగడప మునిసిపాలిటీని స్వచ్ఛంగా తీర్చిదిద్దడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా నిత్యం టన్నుల కొద్దీ వస్తున్న చెత్తను వెంటనే డంపింగ్ యార్డుకు తరలించడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. సేకరించిన చెత్తను తరలించేందుకు మూడు కాంపాక్టర్ వాహనాలను కొనుగోలు చేశారు. పట్టణ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో డంపర్ బిన్లను కూడా ఏర్పాటు చేశారు. మరి కొద్ది రోజుల్లో తాడిగడపను స్వచ్ఛ మునిసిపాలిటీగా తీర్చిదిద్ది చెత్త రహితంగా చేయనున్నారు. తాడిగడప మునిసిపాలిటీలో యనమలకుదురు, కానూరు, పోరంకి, తాడిగడప గ్రామాలను విలీనం చేశారు. ఈ గ్రామాల్లో దాదాపు 46 వేల వరకు నివాసాలు ఉన్నాయి. జనాభా కూడా రెండు లక్షల వరకు ఉంటుందని అంచనా. అయితే ఈ ప్రాంతం అభివృద్ధిలో ముందంజలో ఉన్నా నిత్యం మునిసిపాలిటీ పరిధిలో ఉత్పత్తవుతున్న వ్యర్థాలు పాలకులకు పెద్ద సమస్య మారాయి. దీంతో చెత్త నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

రంగంలోకి కాంపాక్టర్లు

తాడిగడప మునిసిపాలిటీలో రోజూ 100 టన్నుల వరకు చెత్త సేకరణ జరుగుతోంది. చెత్త సేకరణకు 42 వాహనాలు, 15 ట్రాక్టర్లు నిత్యం పని చేస్తున్నాయి. ఇళ్ల వద్ద సేకరించిన చెత్తను ఆటోనగర్‌లో ఉన్న డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి లారీల్లో గుంటూరు జిల్లా ఉన్న జిందాల్ ఫ్యాక్టరీకి చెత్త చేరుతోంది. రవాణా ఖర్చు భారంగా మారడంతో కాంపాక్టర్లను రంగంలోకి దించుతున్నారు. రూ.1.24 కోట్లతో ఒక్కొక్కటి పది టన్నుల సామర్థ్యం కలిగిన మూడు కాంపాక్టర్లు కొనుగోలు చేశారు. ఇప్పటికే రూ.20 లక్షలు వెచ్చించి ప్రధాన ప్రాంతాల్లో 50 డంపర్ బిన్‌లను ఏర్పాటు చేశారు. కాంపాక్టర్లు వచ్చి డంపర్ బిన్స్ వద్ద నేరుగా చెత్త సేకరించి తరలిస్తాయి. చెత్త ఆటోనగర్ డంపింగ్ యార్డుకు తరలించే ఖర్చు తగ్గుతుంది. చాలా సమయం కలిసి రావటమే కాకుండా ఇద్దరు వర్కర్లతో పని వేగంగా చేయటానికి అవకాశం ఏర్పడుతుంది.

డంపర్ బిన్లను ఉపయోగించాలి

రోజూ ప్రజల ఇంటికే వాహనాలు వచ్చి చెత్త సేకరణ చేస్తున్నాయి. ఎక్కువ చెత్త ఉన్న ప్రాంతాల్లో డంపర్ బిన్‌లను మునిసిపాలిటీ ఏర్పాటు చేసింది. వీటిని సక్రమంగా ఉపయోగిస్తే చెత్త సమస్య నివారించటానికి అవకాశం ఉంది. గతంలో చెత్త బహిరంగ ప్రాంతాల్లో వేయటం, సకాలంలో చెత్త ఎత్తక పోవటంతో పారిశుద్ధ్య సమస్య తలెత్తేది. భవిష్యత్తులో మునిసిపాలిటీ పరిధిలో చెత్త సమస్య నివారించటానికి, స్వచ్ఛ తాడిగడపగా మార్చడానికి పాలకులు చెత్త సేకరణకు నూతనంగా అమలులో ఉన్న కాంపాక్టర్లను రంగంలోకి దించుతున్నారు.

ప్రజల సహకారం అవసరం

తాడిగడపను స్వచ్ఛంగా మార్చడానికి ప్రజల సహకారం చాలా అవసరం. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా డంపర్ బిన్లు ఏర్పాటు చేశాం. కాంపాక్టర్లతో చెత్త తొలగిస్తాం. డంపర్ బిన్లను ప్రజలు సక్రమంగా ఉపయోగిస్తే పారిశుద్ధ్య సమస్యలు రావు. దీనికి అందరి సహకారం అవసరం.

– ఎస్.ప్రకాశరావు, కమిషనర్, తాడిగడప మునిసిపాలిటీ

పిన్నమనేని సిద్ధార్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

హనుమాన్‌జంక్షన్ రూరల్: డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ (చినఅవుటపల్లి) ఆధ్వర్యంలో బాపులపాడు మండలం వేలేరులోని గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గుండె, కంటి వైద్య నిపుణులు, జనరల్ మెడిసిన్, మానసిక వైద్య విభాగం నిపుణులు వైద్య సేవలు అందించారు. పిన్నమనేని సిమ్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వేలేరులో డాక్టర్ పిన్నమనేని సిమ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో త్వరలోనే సూపర్ స్పెషాలిటీ ఓపీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన చెప్పారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన ప్రజలకు ఈ వైద్య శిబిరంలో ఉచితంగా రక్త పరీక్షలు, బీపీ, షుగర్ టెస్టులు, ఈసీజీ పరీక్షలు నిర్వహించటంతో పాటుగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రంగారావు, ఏవోలు సుబ్బారావు, నవీన్, ఆస్పత్రి డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కళ్యాణి, మాజీ సర్పంచ్ వేములపల్లి శ్రీనివాసరావు, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అధిపతి డి.రవికుమార్, డాక్టర్లు జె.భరణి, పి.సత్యనారాయణ, సి.సత్యకిషోర్, జాగృతి, పలువురు వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గాఘాట్‌లో పూడికతీత పనులు



పూడికతీత పనులను పరిశీలిస్తున్న చైర్మన్ రాంబాబు, పాలక మండలి సభ్యులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గాఘాట్‌లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు అన్ని సదుపాయాలను కల్పిస్తున్నామని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు పేర్కొన్నారు. దుర్గాఘాట్ అభివృద్ధి పనుల్లో భాగంగా స్నానఘాట్‌లో చేపట్టిన పూడికతీత పనులను గురువారం చైర్మన్, పాలక మండలి సభ్యులు పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఘాట్‌లో మహిళలు దుస్తులు మార్చుకునేందుకు గదుల నిర్మాణంతో పాటు క్లోక్‌రూమ్‌లు, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్నానఘాట్‌లో నుంచి తొలగించిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు ట్రాక్టర్ల ద్వారా తరలించాలని ఆదేశించారు. చైర్మన్ వెంట పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబు, బచ్చు మాధవీకృష్ణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు



వివరాలు వెల్లడిస్తున్న ఈఈ హరిబాబు

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఆటోనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఎన్టీఆర్ సర్కిల్, పంట కాలువ రోడ్డు, బందరు రోడ్డుతో పాటు విజయలక్ష్మికాలనీ పరిధిలోని అన్ని విద్యుత్ సర్వీస్‌లను విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరిబాబు మాట్లాడుతూ.. 2,353 సర్వీస్‌లను తనిఖీ చేశామన్నారు. ఇందుకు గాను 82 కేసులు నమోదు చేశామని చెప్పారు. ఇందులో కమర్షియల్ 320, గృహ వినియోగ సర్వీస్‌లు 2,033 సర్వీస్‌లను తనిఖీ చేశామన్నారు. వినియోగదారుల నుంచి రూ.3.52 లక్షల జరిమానా విధించామని చెప్పారు. తనిఖీల్లో 33 బృందాలు పాల్గొన్నాయన్నారు. అనధికారికంగా విద్యుత్‌ను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధిక లోడు వినియోగంపై సంబంధిత ఏఈలను కలిసి.. దానికి సంబంధించిన డీడీలను తీసిన తర్వాతనే విద్యుత్ వినియోగించుకోవాలని సూచించారు. అధిక విద్యుత్ లోడు వాడితే శాఖాపరమైన చర్యలతో పాటు సర్వీస్‌ను రద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.నవీన్‌కుమార్, ఆపరేషన్ ఏడీ ఎస్.శివకుమార్, ఆటోనగర్ ఏఈ సురేష్, ఏఈలు ఉన్నారు.

ఎంపీడీఓ బాధ్యతలు స్వీకరించిన సత్యకుమార్

గన్నవరం: మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీఓ)గా సత్యకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై ఇక్కడికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్‌గా ఎంపీడీవోగా కొనసాగుతున్న కె.వెంకటేశ్వరరావు నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. తొలుత ఎంపీపీ అనగాని రవిని కొత్త ఎంపీడీవో సత్యకుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ ప్రసాద్, పలు శాఖల అధికారులు, సిబ్బందితో ఎంపీడీవో సమావేశమయ్యారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



గన్నవరంరూరల్: వేసవి విజ్ఞాన శిబిరాలు ఎంతో ప్రాముఖ్యమైనవని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం అన్నారు. స్థానిక గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు సమ్మర్ క్యాంపులు, వాటి ఆవశ్యకత అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు చెస్, న్యూస్ పేపర్ రీడింగ్, యోగా నేర్పించారు.

12న ముక్తేశ్వరాలయంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ట

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం పెరికీడులోని పంచాయతన క్షేత్రమైన ముక్తికాంత సమేత ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో నూతన ధ్వజస్తంభ పునఃప్రతిష్టా మహోత్సవం ఈ నెల 12వ తేదీన వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు, మాజీ సర్పంచ్ తవ్వా హేమేశ్వర నరసింహమూర్తి గురువారం తెలిపారు. ఆలయ ధ్వజస్తంభం జీర్ణావస్థకు చేరుకోవటంతో ఆగమశాస్త్ర ప్రకారం నూతన ధ్వజస్తంభ పునఃప్రతిష్టా కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ నెల 10, 11 తేదీల్లో బ్రహ్మశ్రీ యలమంచిలి కృష్ణమూర్తి శివాచార్య, యలమంచిలి ప్రసాద శర్మ, కుందుర్తి సీతారామయ్య సారథ్యంలో ప్రత్యేక పూజలు, యాగాలు, యజ్ఞాలు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. 12వ తేదీ ఉదయం 7.29 గంటలకు ధ్వజస్తంభ యంత్రప్రతిష్ట, శాంతి కల్యాణం నిర్వహించనున్నామని, మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన జరుగుతుందని తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు గురువారం రూ.లక్ష విరాళం అందజేశారు. నగరానికి చెందిన డాక్టర్ పార్వతిదేవి దంపతులు ఆలయ ఈవో భ్రమరాంబను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,01,116ల విరాళాన్ని అందించారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు ఆశీర్వచనం అందచేయగా, ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు.

పలువురు జెడ్పీ హైస్కూళ్ల హెచ్‌ఎంలు బదిలీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రభుత్వం నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా బాపులపాడు మండలంలోని పలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గురువారం బదిలీ అయ్యారు. కానుమోలు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న ఎస్.లూథర్‌పాల్ రేమల్లె జెడ్పీ హైస్కూల్‌కు బదిలీ అయ్యారు. రేమల్లెలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న ఝాన్సీరాణి గన్నవరం బాలికల ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లారు. అప్పనవీడు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలిగా తోట పుష్పావతి నియమితులయ్యారు. ఆమె భీమడోలు జెడ్పీ హైస్కూల్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆరుగొలను జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ సుబ్బారావు రుద్రపాక జెడ్పీ హైస్కూల్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో టి.దుర్గాప్రసాద్ ముదినేపల్లి మండలం లింగాల నుంచి బదిలీపై వచ్చారు. రామన్నగూడెం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.శ్రీనివాసరావు ఉంగుటూరు మండలం పొట్టిపాడు జెడ్పీ హైస్కూల్‌కు బదిలీ అయ్యారు. మల్లవల్లి జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా కలిదిండి మండలం చింతపాడు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కె.కృష్ణమోహన్ బదిలీపై వచ్చారు. వీరంతా ఆయా పాఠశాలల్లో గురువారం బాధ్యతలు స్వీకరించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



నున్నలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైద్య సిబ్బంది

నున్న(విజయవాడరూరల్): కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడాన్ని హర్షిస్తూ గురువారం నున్న గ్రామంలో వైద్య సిబ్బంది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీటీపీ రమణ మాట్లాడుతూ.. వివిధ ప్రభుత్వ శాఖల్లో రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడం చాలా సంతోషదాయకమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట మేరకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్న నిర్ణయంతో వారికి 010 పద్దు ద్వారా జీతాలు చెల్లిస్తారని చెప్పారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని పలువురు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, గ్రామ పార్టీ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, ఉపసర్పంచి బ్రహ్మానందరెడ్డి, ఎంపీటీసీ ప్రత్తిపాటి రవీంద్ర, పార్టీ నాయకులు కాటూరి శ్రీనివాసరావు, భీమవరపు ముత్తారెడ్డి, అంగజాల హనుమా పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌ల ఎన్నికలు ప్రశాంతం

ఉయ్యూరు: మండలంలోని పెదఓగిరాల, ఆకునూరు పంచాయతీల్లో ఉపసర్పంచ్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. రెండు చోట్లా వైఎస్సార్ సీపీ వార్డు సభ్యులే ఉప సర్పంచ్‌గా విజయం సాధించారు. పెద ఓగిరాల ఉపసర్పంచ్‌గా గుంటక యామిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒప్పందంలో భాగంగా ఉపసర్పంచ్ మున్నంగి సాయిరెడ్డి రాజీనామా చేయటంతో అధికారులు గురువారం ఎన్నికను నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఉయ్యూరు ఈఓపీఆర్డీ మైథిలి వ్యవహరించారు. యామినిని సర్పంచ్ త్రిపురం లక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు గుంటక నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, వార్డు సభ్యులు అభినందించారు. ఆకునూరులో ఉపసర్పంచ్ పదవికి కాకాని వరప్రసాద్ రాజీనామా చేశారు. దీంతో ఉంగుటూరు ఈఓఆర్డీ బాషా ఎన్నికల అధికారిగా ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించారు. 12 మంది వార్డు సభ్యులకు టీడీపీకి చెందిన ఐదుగురు గైర్హాజరయ్యారు. వైఎస్సార్ సీపీకి చెందిన ఏడుగురు వార్డు సభ్యులు సమావేశానికి రావటంతో ఉపసర్పంచ్‌గా పాముల అనిల్‌ను ఎన్నుకున్నారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గారపాటి నాని, వైస్ ఎంపీపీ రాచాబత్తుల మధుసూదన్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ యార్లగడ్డ సాయి, నాయకులు మెరుగుమాల ఏసుబాబు, రమావత్ శ్రీకాంత్‌పలువురు వార్డు సభ్యులు నూతన ఉప సర్పంచ్ అనిల్‌ను అభినందించారు.

జగనన్న కాలనీ లేఅవుట్ స్థలాల్లోకి మురుగునీరు



ఆందోళన నిర్వహిస్తున్న జగనన్న కాలనీ లబ్ధిదారులు

- తెలుగు తమ్ముళ్ల కుయుక్తులు
- ఇళ్ల స్థలాల లబ్ధిదారుల ఆగ్రహం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: మండల కేంద్రమైన బాపులపాడులోని జగనన్న కాలనీ రెండవ లేఅవుట్ స్థలంలోకి మురుగు నీరు వదలి బురదమయంగా చేయటం గురువారం వివాదాస్పదంగా మారింది. ఎంపీపీ యర్రగొర్ల నగేష్, సర్పంచ్ సరిపల్లి కమలాబాయి, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరవల్లి కిరణ్‌మూర్తి నేతృత్వంలో జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు కేటాయించిన లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. లే అవుట్ సరిహద్దులో ఉన్న పొలాల నుంచి టీడీపీ నాయకులు దురుద్దేశపూర్వకంగా నీళ్లు వదిలి లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం లే అవుట్‌లో ప్లాట్లు విభజిస్తూ, సరిహద్దు రాళ్లు పాతుతుండగా, ఆ పనులను అడ్డగించేందుకే స్థలంలోకి నీళ్లు వదిలారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసుకున్న శిబిరాన్ని సైతం ధ్వంసం చేయటంతో లబ్ధిదారులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు.

బైక్ ఢీకొని వృద్ధురాలి దుర్మరణం



కనకమహాలక్ష్మి మృతదేహం

పెనమలూరు: మండలంలోని పోరంకి చేపల కుండీల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ప్రమాదంపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. సీఐ ఎం.కిషోర్‌బాబు కథనం మేరకు.. పోరంకి చేపల కుండీల వద్ద వాటపల్లి నాగలక్ష్మి నివసిస్తోంది. అదే ప్రాంతంలో ఆమె తల్లి చింతా కనక మహాలక్ష్మి (70) కూడా నివసిస్తోంది. కనకమహాలక్ష్మి బుధవారం కుమార్తె ఇంటికి వచ్చింది. తిరిగి తన ఇంటికి వెళ్లేందుకు విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిని దాటుతుండగా కంకిపాడు వైపు నుంచి అతి వేగంగా వచ్చిన బైక్ ఆమెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కనకమహాలక్ష్మిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కనకమహాలక్ష్మి పరిస్థితి విషమించి గురువారం ఉదయం మృతి చెందింది. నాగలక్ష్మి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భార్య మరణానికి కారణమైన భర్త అరెస్టు

పెనమలూరు: అదనపు కట్నం కోసం భార్యను వేధించి ఆమె మరణానికి కారకుడైన భర్తను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. సీఐ ఎం.కిషోర్‌బాబు కథనం మేరకు.. పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన ముష్కాబేగం 2020 సంవత్సరంలో అదే ప్రాంతానికి చెందిన షేక్ లాల్‌బాషాను కట్నకానుకలు ఇచ్చి వివాహం చేసుకుంది. వారు పోరంకిలో కాపురం పెట్టారు. వ్యసనాలకు బానిసగా మారిన లాల్‌బాషా క్రికెట్ బెట్టింగ్‌లకూ అలవాటు పడ్డాడు. భార్యను అదనపు కట్నం తీసుకురావాలంటూ వేధించసాగాడు. పెద్దలు నచ్చచెప్పినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. భర్త వేధింపులు తాళలేక గత మంగళవారం ఉదయం ముష్కాబేగం చున్నీతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలన్మరణానికి పాల్పడింది. ముష్కాబేగం తల్లి రసూల్‌బీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేశారు.

వివాహిత ఆత్మహత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

కంకిపాడు(పెనమలూరు): వివాహిత ఆత్మహత్య కేసులో ఆమె భర్త, మామను కంకిపాడు పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఎస్‌ఐ కె.సుధాకర్ కథనం మేరకు.. మండలంలోని చలివేంద్రపాలెం గ్రామానికి చెందిన దేవరపల్లి నాగవంశీ, లక్ష్మీప్రసన్న (28) భార్యాభర్తలు. కుటుంబంలో ఏర్పడిన స్పర్థలతో ఈ నెల రెండో తేదీన లక్ష్మీప్రసన్న ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. లక్ష్మీప్రసన్న తల్లిదండ్రులు కుమార్తె ఇంటికి వచ్చి చూసేసరికి ఉరివేసుకుని కనిపించింది. కొనఊపిరితో ఉన్న కుమార్తెను వైద్యం నిమిత్తం ఉయ్యూరు, విజయవాడ ప్రాంతాల్లోని ఆస్పత్రులకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఈ నెల ఆరో తేదీ రాత్రి లక్ష్మీప్రసన్న మృతి చెందింది. తమ కుమార్తె మృతికి ఆమె భర్త నాగవంశీ, మామ నాగేశ్వరరావు కారణమని, వారి వేధింపులు, కొట్టడం వల్లే ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నాగవంశీ, నాగేశ్వరరావును గురువారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.